# ఓటరు దొర

అది ఓ జిల్లా హెడ్ క్వార్టర్. బసుస్టాండ్ ప్రక్కనే ప్రెస్ క్లబ్ ఉంది. ఓ మధ్య వయస్సు వ్యక్తి అందులో అడుగుపెట్టి హాల్‌నంత కలియచూసాడు. పత్రికా విలేకర్లు ఆరోజు పంపవల్సిన న్యూస్ రాసుకుంటూ కూర్చున్నరు వేపచెట్టు చుట్టూర రాలిపడ్డ వేపకాయల్లా వాళ్ల చుట్టూర పీల్చి పడేసిన సిగరెట్టు పీకలు.

ముభావంగా లోపలికి వస్తున్న వ్యక్తిని చూసి-" ఎవరు కావాలి" అన్నడు లోకల్ పత్రికా విలేకరి.

"మీరందరూ కావాలి" అన్నడు ఆ వ్యక్తి భుజానికున్న తుపాకిని సరిచేసుకుంటూ.

తుపాకిని చూసి, ఒకరిద్దరు అనుమానిస్తూ సర్దుకొని కూర్చుంటు, 'ఏమో చెప్పలేం' అన్నట్టు ఒకరినొకరు చూసుకున్నారు. 'తాము రాస్తున్న వార్తలు వాళ్లల్లో కోపం తెప్పించవచ్చు. క్లబ్‌లో జొరబడి కాలుస్తే చేసేదేముంది, అనుకుంటున్నపుడు,

" మీతో మాట్లాడడానికి వచ్చిన "

'సరే లోపలికి రండి' అన్నట్టు సైగ చేసి " ఇంతకు తమరెవరు " అని అడిగిండు. అదే విలేకరి అనుమానంతో

కుడి భుజం మీద ఎర్ర రంగు ఉలెన్ శాలువ ఉంది. ఆశాలువ అంచులు ఎంబ్రాయిడరీ చేసి ఉన్నయి. ఎడమ చేతికి వెండి కడియము, కుడి ముంజేతికి రంగు దారాలు ఉన్నయి.

అందరూ ఒకేసారి మళ్లీ అతని వైపు చూసారు, ' ఎవరు ఎందుకొస్తున్నట్టు? భుజానికి ఆ గన్ ఏమిటి? అనుకుంటూ ఇందాకటి అనుమానం బలపడుతుంటే " కూర్చోండి " అన్నడు ఈనాడు విలేకరి. మారు వేషంలో వచ్చిన అన్నయితే కాదుగద అనుకుంటు సిగరెట్‌ను నేలమీద వేశాడు. అందరీ వైపు ఓసారి చూసిండు.

" నేను ప్రెస్‌మీట్ పెడుదామని వచ్చిన " 'ప్రెస్ మీట్ పెట్టడానికి వచ్చినవో మా ప్రాణాలు తీయడానికి వచ్చినవో' అని అనుకుంటున్నపుడు అందరికి ముచ్చెమటలు పోస్తున్నయి. ఒకరి ముఖం ఒకరు చూసుకుంటు ధైర్యాన్ని కూడదీసుకుంటు భయ భయంగా తమ పెన్నులను పక్కకు పెడుతున్నది

చూస్తు.
' ప్రెస్ మీట్ అంటే రాసుకోవాలి కాని కలాలు పక్కన పెట్టుడేంది ' అనుకుంటూ వాళ్లవైపే చూస్తు 'తప్పకుంట ఇతను అన్నే! ఎం.పి.ని చంపడానికి తిరుగుతున్నట్టుంది. లేకపోతే తుపాకితో ఎందుకు తిరుగుతడు' అనుకుంటున్నపుడు

" ఏంలేదు, మా ఎం.పి. కనబడటం లేదు. ఆయన ఎక్కడున్నా ఈ నియోజకవర్గానికి రావల్సిందిగా రాయాలి " అన్నడు కొంచెం సీరియస్‌గా ముఖం పెడుతు.

" అది ప్రకటనవుతుంది కదా " అన్నడు ఈనాడు విలేకరి ధైర్యంగా.

" తరువాత నేను మాట్లాడుతగా, ఆతరువాత ప్రశ్నలు వేస్తరు. నేను జవాబులు ఇస్త. అప్పుడు అది ప్రెస్‌మీట్ కాదా" అన్నడు తలపై టోపిని సరిచేసుకుంటున్నడు.

' మాట్లాడుతవో పిట్లను కాల్చినట్టు కాలుస్తవో' అనుకొని

" మీరూ ప్రెస్ " అని అనుమానంగా చూశాడు విలేకరి

" ఏమి నేను పెట్టకూడదా. అడ్డమైన పార్టీల వాళ్లు, నేరచరిత గల నాయకులు ప్రెస్‌మీట్ మీద ప్రెస్‌మీట్ పెడుతుంటే నేను పెట్టొద్దా " అన్నడు కాస్తా ఆవేశంగా తుపాకిని నేలమీదుంచి దానిమీద చేతులుంచి, ఆపైన తన గదమనుంచి చూస్తూ...

" కనబపడతా లేదని ప్రకటనలాగా అన్నవు కదా" అని అడిగాడు లోకల్ పత్రికా విలేకరి జేవురించిన ముఖంతో. తుపాకి కదలికలనే చూస్తూ

" అన్న, అంటే దానికి సవరణ ఉండదా మంత్రులైతే రోజుకొక మాట మాట్లాడి, తెల్లారి నేనలేదు అంటే తప్పులేదు కాని నేనంటే తప్పా" అన్నడు సీరియస్‌గా చూస్తూ

" ఎందుకుండదు ఉంటుంది" అంటూ ' పొరపాటు అయింది' అన్నట్టు చూశాడు.

' సరే మాట్లాడండి ' అన్నట్టు అందరు కాగితాలతో కలాలతో అతని వైపు మళ్ళిరి.

" నన్ను మీరెవరో అనుకుంటున్నరు? అంతేనా నేను ఈదేశపు ఓటరును."

' సరే ' అన్నట్టు తలలూపారు విలేకర్లు. ఈలోపు ఏదో గాలి రాగా కిటికిల తలుపులు ' దన్‌దన్' మంటూ కొట్టుకున్నయి. అనుకొని శబ్దానికి ఒల్లు జల్లుమనగా అందరు ఒకేసారి కదలి కూర్చున్నరు. అచప్పుడు ఆయన

తుపాకి చప్పుడే అనుకొని వాళ్ల ఎదల్లో లబ్-డబ్ శబ్ద తరంగాలు పెరిగినయి. అప్పుడు గతంలో వారు రాసిన వార్తలు గుర్తొచ్చినయి. ఎవరెవరు నక్సల్స్ గూర్చి వ్యతిరేఖంగా రాసినయి, కళ్లల్లో కదులుతున్నపుడు బి.పి. నార్మల్ స్థాయిని దాటుతువుంది. చూపుల్లో బెదురు, మాటల్లో అదురు చోటు చేసుకుంటున్నయి. తెల్ల ముఖాలు వేసుకుని ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటున్నరు. వాళ్ళ చెవుల్లో తుపాకులు పేలిన శబ్దాలు వినిపిస్తున్నయి. ఎం.పి. ని కాల్చి చంపుతున్న దృశ్యం, వాళ్లకు వ్యతిరేఖంగా రాసినందుకు కొందరు విలేకరులకు తుపాకి గురి పెట్టినట్లు అనిపించగా వాళ్లకు.

" నేనైతే ఏనాడు కూడా వాళ్లకు వ్యతిరేఖంగా రాయలేదబ్బా" అని తనలో తానే అనుకుంటున్నపుడు ఆమాట అందరికి వినపడింది.

' నేను మాత్రం రాసిన్నా అన్నట్టు చూసింద్రు' మిగతావాళ్ళు.

" ఎవరు ఏం రాసింది మాకు తెలుసు" అన్నట్టు చూసింద్రు. అప్పుడు అతని చేతుల్లో తుపాకి అందరి వైపు గురి పెట్టినట్టు అనిపించి నోళ్లల్లో తడి ఆరుతున్నట్టు అనిపిస్తుంది.

" చెప్పాను కదా మా ఎం.పి. కనబడుటం లేదు. ఆయన ఎన్నికల్లో ఓ గుర్తుతో గెలిచి ఢీల్లికి పోయినంకా మరో గుర్తుతో కలిసి పోయిండు మరీ అట్లెందుకు కావాలి.? నేను అడుగుతున్నా అట్లెందుకు మారాలి? మొదట ఉన్న పార్టీలోనే ఉండాలి గదా, ఆ పార్టీలో ఉండకపాయే మొన్న నేను ఢీల్లికి ఫోను చేస్తే అడిగితే అక్కడలేడు. ఆయనను గెలిపించిన ఏరియాలో కనపడడాయే. మరీ ఎక్కడ పాయే. నేను గెలిపించిన వ్యక్తి మళ్లి నన్ను కలిసేది లేదా?' అంటూ ప్రశ్నిచిండు.

' అంతసేపటి వరకు అరిచిన కాకి తన మాటల ధాటికి ఎగిరిపోయింది అనుకున్నడు.' చెట్టువైపు చూస్తు.

" నీవంటే, నీవొక్కనివే గెలిపిస్తివా?" అడిగాడు లోకల్ పత్రికా విలేకరి.

" అవును, నేనంటే నేనే గెలిపించిన". అన్నడు తుపాకి మడిమతో భూమిని తాకుతు

' నా ఒక్క ఓటు వేయబట్టె గెలిచిండు.' అన్నట్టు చూశాడు అప్పుడతని మీసాలు అలాగే చూస్తున్నయి రోశంగా

" నీ ఒక్క ఓటుతోనే గెలిచిండని ఎట్లా చెప్పగలవు "? అడిగాడు ప్రభ విలేకరి. ధైర్యాన్ని కూడగట్లుకొని

" చెప్పగలను. అసలు ఆయన గెలిచింది ఒక్క ఓటుతోనే. ఆ ఓటు నాదే.

ఆ ఎన్నికల రోజు సాయంత్రం ఐదు అయి సీలు వేసే ముందు లోపలికి వెళ్లి చాలా దూరం నుండి వస్తున్న. నా ఓటు వేసినంక సీలు వేయండి. అన్న. వాళ్లు నాచేతిలోని తుపాకిని చూసి గడియారం చూసిరి. ఐదుకు ఒక్క నిమిషం ఉంది. అంతె నా ఓటు పడింది " అన్నడు ఓటరు.

" అంతకు ముందు వేసిన ఓట్లు ఉన్నయి కదా?" అడిగిండో విలేకరి.

" ఉన్నయి ఉన్నయి. ఉంటేముంది లెక్కపెడితే పోటీచేసిన ఇద్దరికి సమానంగా వచ్చినయి. మళ్లి లెక్కపెట్టినపుడు ఈయనకు ఒక్క ఓటు ఎక్కువొచ్చింది. అదే నా ఓటు. ఆకర్న వేసింది కదా ఆకర్నె తేలింది. అంతె మనోడు గెలిసిపాయే" అన్నడు సీరియస్‌గానే రెండు అరచేతులను ఒక్క దగ్గర్కి చేర్చి వదిలేస్తు ఓటరు..

" అంత మాత్రాన అదే నీ ఓటని చెప్పలేం " కదా అన్నడు ప్రభ విలేకరి.

" అట్లనా మరి నేను వేయకపోతే ఇద్దర్కి సమానంగానే వచ్చి ఎవరు గెలవకపోదురుకదా? ఆలోచించండ్రి" అన్నడు ఓటరు తన చేతిని కిందికీ మీదికీ కదిలిస్తూ,

" అది వేరె విషయం " అంటునే ఏదో రాసుకున్నడు ఈనాడు విలేకరి. మిగతా వాళ్లు కూడ రాసుకున్నరు.

" వేరె విషయం ఎట్లా సార్, ఆకర్న వేసిన గోమాంగో ఓటె కదా ఆమధ్య ఢీల్లి ప్రభుత్వాన్ని పడగొట్టింది?" అన్నడు సీరియస్‌గా అందరివైపు చూస్తూ ఓటరు.

" అచ్చా " అంటు ఆలోచనల్లో పడ్డరు అందరు. అంతలోనే 'టీ'వాలా వచ్చి అందరికి అందించాడు. అందరి కళ్లల్లో గోమాంగో కదులుతువున్నడు. బుర్రల్లో ఓటరు వాదనె కదులుతూ ఉంది. మనిషి చూడడానికి అమాయకుడు. మెలిక అద్భుతమైనది. ఒకరి కళ్ళల్లో ఓ మాదిరి మెచ్చుకోలు మెరిస్తే మరొకరి పెదాలపై ఆశ్చర్యపు నవ్వు, కదులుతువుంది. ఓటరు చూపులో మాత్రం ఏదో, ఎంతో చెప్పాలన్న దృఢచిత్తం కనిపిస్తుంది.

" నాకర్థంకాదు, ఎన్నుకున్నది పార్లమెంటుకు పోవడానికి కదా అక్కడి సభలో ఉండరేం?" అన్నడు.

" అయితే మీరు ఢీల్లికి కూడా వెళ్లొచ్చారన్నమాట " అంటు రాసుకోవడానికి ఉపక్రమిస్తు విలేకర్లు.

" ఎల్లొచ్చిన " అనంగానే

" అయితే అనుకున్నట్టుగా ఇతను నక్సల్ కాదన్నమాట" అంటు ప్రక్కన్నే ఉన్న ఈనాడు విలేకరితో అన్నడు లోకల్ విలేకరి.

" మరి ఆ తుపాకి అన్నడు ఈనాడు విలేకరి తుపాకి వైపే చూస్తు."

తుపాకి తేకూడదు కదా అన్నరు. ' తెస్తే ' అని నవ్వాను. నవ్వినందుకు వాళ్లకు కోప మొచ్చినట్టుంది. అట్ల ప్రక్కకు నిలబడమని. ఆయుధాలు దగ్గరవుంచుకోవద్దు గదాఅనిరి. అయితే సర్దారుల సంగతీ అన్న. అంతేగాదు గన్‌మెన్‌లకు ఉండగ నా దగ్గర గన్‌వుంటే ఏమిటంటి వాళ్లు ఒప్పుకోలేదు. దానిని తీసుకుని వాళ్ళ దగ్గరే ఉంచుకొని నన్ను లోపలికి పంపించిరి. తీర లోపలికి వెళ్లి చూస్తే మన ఎం.పి.లేనేలేడు. ఆయనేకాదు ఇంకా చాలామంది ఎంపీలు లేరు. కుర్చీలన్నీ ఖాళీయే. ఉన్నవాళ్లలో ఒక్కరు మాట్లాడుతుంటె మరికొందరు నిద్రపోతున్నరు. మొత్తం మీద పార్లమెంట్ అంటే గిదేనా అనుకున్న. ఈలోపల మాట్లాడే వ్యక్తి ఏదో అనగానే కూర్చున్న వాళ్లందర్కి కోపం వచ్చింది వెంటనే మేము అవుట్. అంటు బయటికి నడుస్తునే ఉన్నరు" అంటు ఆశ్చర్యంగా అందరివైపు చూసిండు.

అవును చట్ట సభలో కూర్చొని విషయంపై చర్చించి చట్టాలను చేయమంటే లేచి బయటికి పోవుడెందో నాకు అర్థం కాలేదు. వాళ్లకంటే మన పంచాయితి మెంబర్లు నయం. చివరి వరకు ఉండి తాడోపేడో తేలుస్తరు."

" అదట్ల ఉందా " ఇక పాత ఢిల్లీని చూసిన, అన్నీ రాతి కోటలే!, రాజుల పైసలు రాళ్లపాలు అనుకుంటి. కొత్త ఢిల్లీ అంతట బంగ్లాలు భవంతులు. అద్దాల మేడలు. ఆఫీసు భవనాలు. పెద్ద పెద్ద రోడ్లు. వాటిని దాటిపోతే ఏముంది అన్నీ గోరీలేనాయే. ఎకరాల కొద్ది గోరీలే గోరీలు, బతికినోడు ఉండడానికి గజాలకొద్ది స్థలమైతె చచ్చినోళ్లకు ఎకరాల కొద్ది ఏర్పాటు చేసింద్రు. నాకైతే అస్సలు అర్థమేకాలేదు." అంటూ తన కోటు జేబిలోనుండి ఓ ఫోటో తీసి ఓ విలేకరికిచ్చిండు.

ఆ ఫోటోలో భారత ప్రధానితో తాను. దానిని ఒకరి తరువాత ఒకరు అందరు చూసిరి.

" అచ్చా ప్రధానితో ఫోటో కూడా దిగితిరా " అన్నడు ఆశ్చర్యంగా ఓ విలేకరి ఫోటోనే చూస్తూ...

" ఒక్కరోజు ఆలస్యంగా పోతే నేను ఈ ఫోటో దిగకపోదును " అన్నాడు

కొంచం విచారంగా.

" ఎందుకు " అని అడిగారు ఒక్కరిద్దరు విలేకర్లు ఒక్కసారె.

" ఏముంది నేను కల్సిన తెల్లారి ఆయన్ను ప్రధాని పదవి నుండి దించేసింద్రు. అదే నేను చెప్పితి కదా ఒక ఓటు గద్దె నెక్కించగలదు, గద్దెను దించగలదు.

అంతేకాదు దక్షణాన అదే ఆ సినిమా నటి నటన చెప్పలేనిది. అధికార దుర్వినియోగం కోట్ల ఆస్థిని కూడబెట్టడం.

ఉత్తరానా మాయవతట ఆమె అంతే, మమత కూడా మాయచేసింది. ఆ సోనియాగాంధీ, మన దేశం మనిషిని చేసుకునే ఇక మన మనిషి అయిపోదూ? ఆనలుగురు ఆడవాళ్లు కలిసి మొగవాళ్లను ఓ ఆట ఆడించి తీరిరి మగువలా మజాకా. మగవాళ్లు సంపాదించింది అంతా తిండి తాగుడు ముండలకే పోతే వాళ్ళు కూడబెట్టింది గుట్టలైపోతుండే.!" అన్నడు ఓటరు.

' ఈయనకు ఇన్ని రకాల ఆలోచనలు ఉన్నయి. మాములు మనిషి అయితే కాదు సుమా ' అనుకొని

" ఆవును ఇంత చూసిన మీకు మన రాజకీయాల మీద ఏమనిపిస్తుంది" అడిగాడు ప్రభ విలేకరి.

" అన్నీ కోతిచేష్టలు ఎవ్వరూ ముందు అనుకున్న మాటమీద ఉండరు. వీళ్లకంటే నామాటలే నయం. వీళ్ల మాటలెవ్వరూ వినరు, విన్నా నమ్మరు. అన్నడు చిరునవ్వు చిందిస్తూ...

" ఇంకా చెప్పండి. మీకు ఇన్ని విషయాలు ఎట్లా తెలుసంటరు" అన్నడు ఓ విలేకరి.

" నాకంటె మీకే ఎక్కువ ఎరుక. ఏముంది ఎన్నికలొచ్చి పాయే. ఈసారి ఒకపార్టీ గవర్నమెంట్ కాదు కదా పది పార్టీలు కల్సినయా! ఎవరు కాదన్న ప్రభుత్వం పడిపాయే! మళ్ళీ ఎన్నికలు. దేశ సంపదంతా ఎన్నికలకే అయితే మరీ తెచ్చిన అప్పులు అన్నడో విలేకరి.

" అప్పులోనికి ఆస్థి చూపిస్తే పాయే అన్నడు ఓటరు."

" అంతేనా తెచ్చిన అప్పులు" అన్నడు విలేకరి.

" ఇంతకు ఈ ప్రెస్ మీట్ ఏ ఉద్దేశ్యంతో పెట్టినట్టు" అడిగాడు ఈనాడు విలేకరి.

" నా ఉద్దేశ్యాన్ని అందర్కి తెలియజేసేటందుకు" అన్నడు.

" ఈ విషయంలో మీరిచ్చే సలహా ఏమిటి?" విలేకరి అడిగాడు

" అవసరాలను పట్టి రాజ్యాంగాన్ని మార్చుకోవాలి."

" రాజ్యాంగాన్ని మార్చాలంటే తగు మెజారిటి ఉండాలి" అన్నడు విలేకరి.

" అయితే ఆ రోజు అందర్కి మీటింగుకు రమ్మనాలి. రాగానే తలుపులు మూసేయాలి. ఎవరిని బయటికి పోనియ్యోద్దు" అన్నడు ఓటరు.

" చూస్తువుంటే రోజు రోజుకు ఇంటికో పార్టీ అయ్యేటట్లుంది. ఏ ఒక్క పార్టీకో మెజారిటి రావటం జరగని పని " అన్నడు మూతిని దగ్గర చేసి వదులుతు మళ్లీ తానే.

" అంతే నంటారా "

" నేననేదేముంది చూస్తుంటే కనపడడంలేదు.? నాకంటె మీకే ఎక్కువ తెలుసు. రోజు రాసేది మీరెకదా! కేంద్రం అట్లయితే రాష్ట్రంలో అంటూ ఓ చేత నోరు మూసుకుని...

" ముక్కలు చెక్కలు అయిపాయె. ఎంత ప్రజాస్వామ్యమైనా గింత స్వాతంత్ర్యమా?" అంటు నెత్తికి చేయి పెట్టుకున్నడు.

విలేకర్లు ఆయన ఆవేదనను చూసి విస్తుపోతూ.

" ఈసారి అట్టడుగు వర్గాలకు సీట్లు కేటాయించి పార్టీల పరంగ 'బి' ఫామ్ ఇవ్వాలి " అన్నాడు కదిలికూర్చుంటూ.

" 'బి' పామ్ అంటే తెలుసా; మీకు " అని అడిగాడు ఓ విలేకరి.

" రేపటి మధ్యంతర ఎన్నికల్లో పోటీ చేయాలని చూస్తుఉంటే 'బి' ఫామ్ తెలుసా అంటరేం?" అంటు సీరియస్‌గా చూసిండు.

" మొన్ననేగద ఎన్నికలు అయింది అప్పుడే మళ్ళీ ఎన్నికలా?"

" కావా మరి ఏ పార్టీకి పూర్తి మెజారిటి రాలేదుగ" లోకల్ పత్రిక విలేకరి.

" నాడు ఎన్‌డిఏ అయితే నేడు యూడిపి ఎప్పుడు విడిపోతదో తెలియదు" అనగానే.

ఒక్కసారె అందరు ఆలర్ట్‌గ చూసారు.

" మీకు ఏపార్టీ అంటె ఇష్టం " అని అడిగాడు ఓ విలేకరి.

" ఏపార్టీ టికెటిస్తే ఆపార్టీయే ఇష్టం " అన్నాడు సీరియస్‌గా ఓటరు.

" పెద్ద పెద్ద సీనియర్ లీడర్లే చివరి క్షణంలో పార్టీలు మార్చంగా" అంటు ఆగాడు మళ్లీ తానే.

" ఇంతకు మీరు ఏ పార్టీ అడిగాడు వార్త విలేకరి "

" చేతిలో తుపాకి కనిపించడం లేదా అదే పార్టీ " అన్నడు సీరియస్‌గా.

' ఇతను మధ్య మధ్య నటిస్తుండు కాని ప్రక్క నక్సలే!' అనుకొని

" గెలిచే పార్టీని కోరుకోరా?"

" కోరుకుంటా ఇల్లిల్లు తిరుగుత. అందరిని ఓట్లు అడుగుత అడుక్కోవటం కొత్తేమి కాదు?" అన్నడు. కాసేపు చిరునవ్వులు. ఆ తరువాత కొంతసేపు మౌనం వహిస్తూ.

" మీరు ఎన్నికల్లో నిలబడతానంటున్నరు. మీ ఆర్థిక పరిస్థితి ఏమిటో చెప్పలేదు." అడిగాడు విలేకరి. అప్పుడు ఆవును అన్నట్టు మిగతా అందరు ఆయనవైపు ప్రశ్నార్థకంకా చూసారు.

సీరియస్‌గ మారుతు " నాడైనా నేడైనా కోట్లు గలవాన్నే జన్మభూమి పనులకు లెక్కలేనంత డబ్బులిచ్చిన ఈ మధ్య కొన్ని బ్యాంక్‌లు మూతపడి నేను కొంత మునిగిన, నష్టమొచ్చింది." అన్నడు ఓటరు.

" ఎన్నికల ఖర్చు ఇప్పుడు లక్షలు పోయి కోట్లకు పెరిగిందట ఎక్కడి నుండి తెస్తరు?" అడిగాడు ఈనాడు విలేకరి.

" ఓష్ అదా మీ అనుమానం కోట్లకు కోట్లు పెరిగితే దాని గురించిన అలోచన లేకుండానే ఎన్నికలలో దిగుతానా? ' అభ్యర్థుల ఫండ్ ' అని ఓ పద్దు పెట్టిస్తా. అందరి దగ్గర ఉన్న నల్లడబ్బంతా అందులో జమ చేయిస్త. ఆర్షాద్ మెహత కాజేసిన వేలకోట్లను కక్కిస్తా! ఎంత కష్టపడి పనిచేసిన రోజుకు నూరు రూపాయల కూలి గిట్టదు, వాడు కోట్లకు కోట్లు కాజేసి కూసుంటడా? ఎవరబ్బసొమ్ము.? మీ పత్రికల వాళ్లు దాని గురించి రాసి రాసి ఎటుతేలకముందే ఆపేస్తరి. తాడో పేడో తేల్చరైతిరి. ఆతరువాత ప్రధాని తీసుకున్న సూట్‌కేసులు వాపసు తెప్పిస్తా. నాకెవరన్న రూపాయిచ్చే చోట పదిరూపాయలు ఇస్తే పరేషాన్ అయిచూస్తూ. అది అసలు నోటేనా అనిగూడ ఆలోచిస్తా. వొద్దు తండ్రీ అని మిగతా చిల్లర తిరిగిస్త. అబ్బా సూట్‌కేసుకు సూట్‌కేసే తీసుకుని దాసుకోవటమేనా? గాపార్టీ అధ్యక్షుడు పార్టీ ఫండని లక్షరూపాయలు ఇస్తే ఫోటోలు తీసి టాం టాం చేసి బంగారమసోంటోన్ని బజారుపాలు చేస్తుంటే మీ పత్రికలోల్లు వాళ్లకే దబ్బాకొడితిరి. ' ఎవరు దొంగ అంటే గుడ్డబట్టలోడు'!

ఇంక ఆయుధాలు కొనుగోలప్పుడు తీసుకున్న కమీషన్లు ఒక్కతాడికి రావాలి. ఆ శవపేటికల కమీషన్ కక్కాలే అంటూ అందరి వైపు ఓసారి చూసాడు. " ఆగండి ఆగండి" అని పెన్నులు పక్కనబెట్టి సిగరెట్లు అంటించుకున్నారు. తాను కోటు జేబులో ఉన్న చిన్న నీళ్ల సీసా తీసి ఓ గుటుకు మింగి, మళ్లీ బిరడా బిగించి జేబులోవేసుకున్నడు.

" ఇంకా " అన్నాడు. పీల్చిన పోగను బయటికి వొదులుతు ఓ విలేకరి.

" అదే ఆ టాటా, బిర్లా, రిలయన్స్, అందరుకూడ వాళ్లు అధిక రాబడి,

కొంత ప్రజల నుండి దోచిన డబ్బులు, కొన్ని ఎన్నికలప్పుడు మళ్ళీ ప్రజలకే చేరేటట్టు కొంత భాగం ఈ అభ్యర్థుల ఫండ్‌కు జమ చేయాలి. అట్లానే ఇన్‌కంటాక్స్ ఎగ్గొట్టే సినిమా యాక్టర్లు కొంత ఈ ఫండ్‌కు జమచేయాలి." అన్నడు ఏదో కొత్త ప్లాన్ ప్రతిపాదించినట్టు.

"సినిమాయాక్టర్లే ఎన్నికల్లో నిలబడుతున్నారు. మంత్రులయితున్నారుగదా మీకెక్కడిస్తారు" అన్నడో ఓ విలేకరి.

'అదే తప్పు ఒక మనిషికి ఒక వృత్తే ఉండాలి. రాజకీయాలలోకి రాదల్చితే సినిమావృత్తి మానుకోవాలి. రేపు చూడండ్రి నేను ఎన్నికలలో పోటిచేస్తే. ఈనా వృత్తిని వొదిలేస్తా" "అంటు తుపాకిని మరో కుర్చికి ఆనించిండు. టోపితీసి తుపాకికి తగిలించి కోటును తీసి చేతిమీద వేసుకున్నడు.

" నీవు వచ్చినపుడు ఆసంకలో తుపాకి చూసి నక్సల్‌వనుకున్నాం అన్నడు" లోకల్ విలేకరి.

అదివిని అందరు నవ్వేనవ్వ ఒకటేనవ్వులు, కనుకొలుకుల్లో నీళ్లూరే వరకు నవ్వుకున్నారు.

" అది నీ పేలని తుపాకి అని తెల్సిందికాని మాటలు మాత్రం తూటాలాగున్నాయి." అన్నాడు ఉర్దు పత్రికా విలేకరి.

"నేను బతికేది మాటలతోనేకదా; ఓ పెట్టుబడిలేదు. లేబర్‌ను ముంచేది. బ్యాంకప్పుచేసేది తిరిగి ఇవ్వకుండా ఎగ్గొట్టేదిలేదు. టాక్సలను ఎగ్గొట్టేదిలేదు. అవును నక్సల్ మాటొచ్చింది. మొట్టమొదటి నక్సల్స్ ఇప్పుడెక్కడున్నరు. ఆ ఉద్దేశ్యాలు, ఆ ఆశయాలు ఏవి? చంపుడు చావుడే తప్పా బతుకుతు బతికించు అన్నపెద్దల మాట ఎప్పుడో నీట కలిసే." అన్నడు.

" ఇప్పుడు వాళ్లు లొంగిపోయి జనజీవనంలో కలుస్తున్నారుగదా"

" అని మీరు రాస్తున్నరు. అది అంత ఈజీగా అయ్యేపనేమికాదు" వాళ్లకు ప్రజల్లో సానుభూతిలేదు. ఉంటే మొన్న ఎన్నికల్లో నిలుచున్న మాజీలు ఎందుకు చిత్తుగా ఓడిపోతరు." అన్నడు. మళ్లీతానే.

" మంచి మంచి మంత్రులే ఓడిపోయిరి. ఎన్నికలు అంటె అంతే గదా"

" మంత్రులైతే ఏంది? వాళ్ల వాళ్ల పద్ధతులు బాగలేనపుడు ఎవరైనా ఓడిపోవల్సిందే " అని కాస్త తీవ్రంగా అన్నడు.

" అవును ఓడిన పార్టీలు ఇప్పుడు తమ తమ తప్పుల లిస్టును ప్రకటిస్తున్నరు చూస్తున్నరా?"

" అంతెగదా అందరం కల్సి బతుకుదాం అనుకుంటుండగా గుజరాత్‌లో ఏం జరిగే. ఆ దెబ్బకే పూవు రెక్కలన్నీ రాలిపోయె. ఎవరు చేసుకున్నది వాళ్లె అనుభవించాలని పెద్దలు ఊరికే అనలేదుగ" అన్నడు ముగింపుకొస్తు.

" చంద్రబాబును ప్రపంచం అంతా మెచ్చుకొని కితాబు లిచ్చిరిగదా

మరి ఆయన ఎందుకు ఓడిపాయే" అడిగిండు లోకల్ పత్రిక విలేకరి.

" ఆయన ఎందుకు ఓడిపోయిండు. ఆయన పార్టీ ఓడిపోయింది." అని ముసిముసిగా నవ్వుతు అన్నడు ఓటరు.

" అదే పార్టీ ఎందుకు పాయే? పార్టీపోగానే ఆయన ప్రభుత్వం పాయే ఏమొచ్చె" అన్నడో విలేకరి.

" ఏమొచ్చుడంటే అనుభవం వొచ్చింది. ఆయన పల్లెల్ని మర్చిపోయి పట్టణాల్ని పెంచిండు. అవయ్యా పండించే రైతునే మర్చిపోతే ఎట్టా? గందుకే గట్ల జరిగింది." అన్నడు ఓటరు.

" ఆయన్నేం చేయమంటవు, వర్షాలు కురిపిస్తాడా పంటలు లేక వరుసగా కరువొచ్చే!" అన్నడు విలేకరి.

" అగ్గో మీ పేపరోల్లు గట్టరాసె ఆయనను చెట్టెక్కించింద్రు. ఆఖరికి పట్టు తప్పి కింద పడే! అంతా చేసేది మీరు, మీ రాతలు మీ పత్రికలే!" కాస్త తీవ్ర స్వరంతో అన్నడు.

అందరు నవ్వారు. అదిచూసి తాను నవ్వకుండా " నవ్వారు కదా? మరి మీ ఓటు నాకు వేస్తారా లేదా" అని అడిగిండు సీరియస్‌గా. అందరివైపు సీరియస్‌గా చూస్తూ.

ఎట్లాగో నేను ఇల్లిల్లు తిరుగుతాకదా అట్టానె నాప్రచారం నేనే చేసుకుంటా, ఈసారి ఓటు నాకే వేయమని వేడుకుంటా" అన్నడు చిరునవ్వుతో.

" మీరు వేస్తే నేను గెలుస్తా, అంతేకాదు అందరిని వేయమని కూడా రాయండి. రేపటి పత్రికల్లో నా గురించే ఉండాలి. చూస్తాగ" అన్నాడు తుపాకిని భుజానికి తగిలించుకుంటు

" మీరు గెలిస్తే "

" మంత్రినై ఈ కరువును పోగొడత. అందర్కి తిండి బట్ట అందేటట్లు చూస్త. నాకు తోయకుంటే అమర్త్యసేన్ సలహా అడుగుతా. ఆయననే సలహాదారుగ తీసుకుంటా.రైతుల ఆత్మహత్యలను ఆపేస్తా. పంటలు బాగపండేట్లు చూస్త."

" వర్షాలు పడందే " విలేకరి

" కృత్రియ వర్షాలు కురిపిస్తా. సముద్రంలో కలిసే నదులను ఒకచోట కలిపి వాటికి ఆనకట్టలువేసి ఆపి, పొలాలు పారిస్త అప్పుడు పంటలే సంటలు. అంతేకాదు మనిషికి కావల్సింది ఎంత తిండి? రెండే రొట్టెలు. ఆరెండు రొట్టెలతోనే నేను బతుకుతున్న. మన రెడ్డి రెండు రూపాయలకు రెండు జొన్నరొట్టెలు ఇస్తలేడూ? దానినే దేశమంతా ప్రవేశపెడతా. బజబజారున మంట గంజి సెంటర్లు పెట్టిస్త. నా మాట నమ్మండి. నేను ఇంకా రాజకీయాలలోకి పోలేదు సుమా ఇకనుండి నడుస్తున్నది చెపుతున్నా నడిచేది

చెపుతున్న నమ్మండి" అన్నడు.

" మరి పెరిగే ధరలను ఎట్లా అరికడతరు " అడిగాడు ఓ విలేకరి

" అరికడతా అంతే మన ప్రధానిలాగ భార్య కోరిక తీర్చలేనంత మామూలు మనిషిని కాదు నేను. మీరుపోయి అమ్మా మీ భర్త ప్రధాని అయ్యారుకదా మీ స్పందన ఏమిటి అని అడిగితే ఈ ప్రభుత్వంలో వంటగ్యాస్ ధర పెరగకుంటే చాలు అంది. ఆమాట భారతదేశ గృహిణుల తరపు నుండి ప్రతిపాదన అయితే ఏం జరిగిందో మీకు తెలుసుగా'' అంటు చిరునవ్వునవ్వాడు ఓటరు.

" మన రైల్వే మంత్రిగారు గురుగుల్లో చాయ్ తాగాలన్నాడు. మీరే మంటారు."

" గురిగికి కూడ కొంతఖర్చు, నేను ఆకుల్లో తినమంటాను డొల్లల్లో తాగమంటాను, అంతకంటె తక్కువ ఖర్చు కదా. ఎక్కువ సంపాదించేదాని కంటే తక్కువ ఖర్చు ముఖ్యం. ఇదీ సింపుల్ అర్థిక సూత్రం." అన్నడు.

చాయ వాలా " మరొకసారి చాయ తెమ్మంటారా " అని అడిగిండు నవ్వును ఆపుకుంటూ

" సాయంత్రం వస్తగా, అందరు ఉంటారుగా సార్లు. అదే సాయంత్రమందే " అంటు చేతులు జోడించాడు. అది చూసి అందరు ఒక్కసారే ఊపిరి పిల్చుకున్నరు.

" మీరు మీ పేరు చెప్పారుకాదు " లోకల్ పత్రిక విలేకరి అనుమానంతో అడిగిండు.

" రాసుకోండి, దొర." అన్నడు ఓటరు

" మీది ఏ కులం?" అడిగాడు ఓ విలేకరి.

' ఈ దేశంలో కులం అడగక ఊరుకోరుగదా' అనుకుంటు కొంచెం అసహనంగా చూసాడు. అప్పుడు ఆయన ముఖంలో ఈసడింపు భావం కనిపించింది.

" పేద కులం " అంటు లేచి తుపాకి అందుకుని నిలుచున్నడు.

ఈ లోపు సెల్‌మోగింది.

అందరు జేబులు చూసుకున్నరు. వెంకట్రాములు కోటు జేబులో చేయిపెట్టి సెల్ తీసి, చెవిదగ్గర ఉంచి " హాల్లో " అంటు బయటికి నడుస్తుఉంటే, అందరు ఆయన్నే చూస్తు నిలుచుండిపోయింద్రు.

● జూలై 2004